ప్రజాశక్తి

శుక్రవారం 19 మే 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

గాలి హోరు..వాన జోరు..

- పిడుగుపడి ఎద్దు మృతి
- కురిచేడులో కూలిన వృక్షాలు

ప్రజాశక్తి-ముండ్లమూరు

ముండ్లమూరులో గురువారం భారీగాలులతో అకాల వర్షం కురిసింది. గురువారం మధ్యాహ్నం వరకు ఎండలు కాయగా.. సాయంత్రం ఆకాశం చల్లబడింది. విపరీతమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉమామహేశ్వరపురం గ్రామంలో కళ్లాల్లో అరబోసిన మిరపకాయలు తడిసిపోయాయి. పోలవరం గ్రామంలో కోసిన నూగు గూడులు గాలికి లేచిపోయాయి. ఈదర గ్రామంలో వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. పూరిమెట్ల గ్రామంలో పిడుగుపడి ఎద్దు మృతిచెందింది. అదే గ్రామానికి చెందిన వంకాయల అంజిరెడ్డికి చెందిన ఇంటి రేకులు లేచిపోయాయి. సుమారు 50 వేల రూపాయల నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.



కురిచేడులో రోడ్డుపై కూలిన భారీవృక్షం

విరిగిపడ్డ భారీ వృక్షాలు

కురిచేడు: మండలంలో గురువారం వీచిన బలమైన గాలులకు మండల పరిధిలోని బోధనంపాడు గ్రామంలో పది భారీ వృక్షాలు రోడ్డు మీద విరిగిపడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ వీచిన గాలుల వల్ల మండలంలో విద్యుత్ సరఫరా గంటల తరబడి నిలిచిపోయింది. దీంతో స్థానికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం రాత్రి 8 గంటలకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది.

వడదెబ్బకు ముగ్గురు మృతి

మృతుల్లో ఒకరు ఉపాధి కూలి

2లో

చిందే చెమటలు..మండే గుండెలు..

- వేసవిలో ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలూ కరువు
- గతంలో వసతులనూ తీసేసిన పాలకులు
- అలవెన్స్‌లు గాలికి.. బడ్జెట్‌లో నిధులు తగ్గింపు
- తీవ్ర ఇబ్బందుల్లో కష్టజీవులు



యర్రగొండపాలెంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉదయం 9 దాటితే చాలు భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. నాలుగు గోడల మధ్య చేసే శ్రమ కాదు వారిది. మండుటెండలో పని చేయాల్సిందే. నీడైనా కానరాని చోట, వెంట తెచ్చుకున్న గుక్కెడు నీళ్లు క్షణాల్లోనే అయిపోయే పరిస్థితుల నడుమ తడారిన గొంతులతో దిక్కులు చూడాల్సిందే.. ఒంట్లో సత్తువ ధారల్లా కారిపోతుంటే, గిడసబారిన భూమిలో గునపం దింపాలంటే శక్తినంతా పోగేయాల్సిన పరిస్థితి. ఉపాధి కూలీల దయనీయ చిత్రమిది. పనులు చేసేచోట కనీస సౌకర్యాలు లేక చెమట తుడుచుకోవడానికి తెచ్చిన వస్త్రమే నెత్తిన వేసుకుని సేదతీరుతుంటారు. వేసవి సన్నద్ధత క్షేత్ర స్థాయిలో కాకుండా అధికారుల కాగితాల్లోనే కనిపిస్తోంది.

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో వసతుల కల్పనలో మాత్రం వైఫల్యం కనిపిస్తోంది. ఒకప్పుడు టెంట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు, మజ్జిగ ఉండేవి. ఇప్పుడా ఊసే లేదు. వడగాడ్పుల ముప్పుపై ఇప్పటికే భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, షెల్టర్లు ఉంచాలని సర్కారు సన్నద్ధం చేసినా క్షేత్రస్థాయిలో సమకూరడం లేదు. అక్కడక్కడా ప్రథమచికిత్స పెట్టెలు ఉంచుతున్నా మిగిలిన వాటి ఊసే లేదు. యర్రగొండపాలెం మండలంలో 18,400 జాబ్‌కార్డులున్నాయి. రోజూ 12,193 మంది కూలీలు పనికి వెళుతున్నారు. 18 గ్రామ పంచాయతీలో కుంటలో పూడికతీత, నీటి నిలువ కందకాలు, పంట కందకాలు పనులు జరుగుతున్నాయి.

ఫొటో తీయలేదో అంతే..

ఉపాధి పనులను నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఈ యాప్ ఉదయం 7 గంటలకు ఓపెన్ అవుతుంది. ఫీల్డ్ అసిస్టెంట్లు పది మంది కూలీలను బందాలుగా విభజించి పని ప్రాంతం వద్ద వారందరి ఫొటో తీయాలి. ఉదయం ఏడు గంటలకు ఒక ఫొటో, 11 గంటలకు మళ్లీ మరో సారి తీసి యాప్‌లో నమోదు చేయాలి. ఇలా చేస్తేనే ఆ రోజు కష్టానికి కూలీలకు వేతనాలు అందేది. ఎండ తగిలిందనో, నీరసంగా ఉందనో నిష్క్రమిస్తే చేతికొచ్చేది ఏమీ ఉండదు. పని ప్రదేశాల దగ్గర అంతర్జాలం పని చేయకపోతే ఈ ఫొటోలు తీయడంలో జాప్యం తప్పడం లేదు.

భత్యంలో కోత..

ఉపాధి పనిచేసే కూలీలకు వేసవిలో మూడేళ్ల క్రితం వరకు కొన్ని భత్యాలు అందేవి. సాధారణ రోజుల్లో 100 శాతం పనిచేస్తే ఇచ్చే మొత్తాన్నే వేసవిలో 80 శాతం చేస్తే ఇచ్చేవారు. దీంతో 80 శాతం పనిచేసినా 100 శాతం వేతనం వచ్చేది. టెంట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు, ఇతర సామగ్రి అందించేవారు. మజ్జిగ కోసం ఒక్కో కూలీకి రూ.8, అయిదు 2లో

కోఆర్డినేటర్లపై తర్జనభర్జన

- 'బాలినేని' స్థానంలో ఎవరనేదీ సందిగ్ధం
- జిల్లాపరిధి కోఆర్డినేటర్‌కు ప్రచారంలో విజయసాయిరెడ్డి
- మళ్లీ జిల్లాపై దృష్టి సారిస్తున్న టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో


బాలినేని శ్రీనివాసరెడ్డి రాజీనామాతో పార్టీ కోఆర్డినేటర్ల వ్యవహారం సందిగ్ధంలో పడింది. ఆయన స్థానంలో ఎవరనేదీ ఇప్పటికీ అధిష్టానం నిర్ణయం తీసుకోలేదు. బాలినేని నెల్లూరు, కడప, తిరుపతి జిల్లాలకు కోఆర్డినేటర్‌గా ఉన్నారు. ఆయన తన పదవికి రాజీనామా చేశాక జరిగిన పరిణామాలు ఆ పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో గందరగోళానికి దారితీశాయి. ఇక ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలకు కలిపి బీదా మస్తాన్‌రావు, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు. అయితే ఇటీవల వీరు కూడా జిల్లాలకు రావడం లేదు. మొదట్లో కొన్ని నియోజకవర్గాల్లో పర్యటించారు. అభ్యర్థులపై స్పష్టత ఇచ్చారు. తర్వాత పార్టీ వ్యవహారాల్లో వారిపాత్ర నామమాత్రంగానే ఉంది. జిల్లాకు రావడం లేదు.

బాలినేని రాజీనామా చేశాక జిల్లాలో బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనను సిఎం జగన్ ఎదుట ఉంచారు. ఇక్కడ నాయకత్వం కూడా 'బాలినేని'కి బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నారు. తాజా పరిణామాలు పార్టీలో గందరగోళానికి తెరలేపాయి. బాలినేని రాజీనామా తర్వాత సిఎం జగన్‌ను కలిశారు. రాజీనామా ఉపసంహరించుకోవాలని కోరారు. ఆరోగ్య కారణాలు, నియోజకవర్గంలో ఎక్కువ సమయం కేటాయించాల్సి ఉన్నందున రాజీనామాకే కట్టుబడి ఉన్నారు. సిఎం జగన్ చెప్పినా వినలేదు.అయితే ఆయన ఇటీవల తన కుమారుడితో కలిసి మీడియా సమావేశం పెట్టి పార్టీలోని పెద్దలు కొందరు తనకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారని, తనకు ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారంటూ వాపోయారు. తీవ్ర ఆందోళన చెందారు. పార్టీలో తనను ఇబ్బందులు పెడుతున్నారంటూ పరోక్షంగా తన బావమరిది టిటిడి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిపైనే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలపై అధిష్టానం పెద్దలు ఎవరూ స్పందించలేదు. తర్వాత బాలినేని వ్యవహారంపై పలు రకాలుగాఊహాగానాలు తెరపైకి వచ్చాయి. ఇదంతా సొంతపార్టీ నేతలే చేస్తున్నారని బాలినేని ఆరోపించారు. రెండ్రోజుల క్రితం కూడా తాను ఒంగోలు నుంచే పోటీచేస్తానని. కొందరు కావాలనే తాను దర్శి, గిద్దలూరు, మార్కాపురం నుంచి పోటీచేస్తారనే ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఇది వాస్తవం కాదన్నారు. బాలినేని రాజీనామా చేయడం, తర్వాత మీడియా సమావేశంలో పార్టీ పెద్దలపై ఆరోపణలు చేయడంతో వైసిపిలో అనిశ్చితి నెలకొంది. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు కూడా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. నిన్నా మొన్నటి వరకూ బాలినేని ఎంతో సన్నిహితంగాఉన్న నేతలు కూడా ఇపుడు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం ఆయనపై జరుగుతోన్న ప్రచారాలపై దృష్టి సారించారు. బాలినేని భవితవ్యం ఏమిటనే చర్చ వైసిపిలో తీవ్రంగానే సాగుతోంది. ఆయన మాత్రం నియోజకవర్గంలో చిన్నచిన్న కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గడప గడపకూ నిలిపేశారు. ఈ తరుణంలో ఆయనకు జిల్లా బాధ్యతలు అప్పగించే విషయంపైనా స్పష్టత రాలేదు.ఇక బాలినేని రాజీనామా చేసిన కోఆర్డినేటర్ పదవికి ఎవరినీ నియమించలేదు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఉన్న 2లో

వివాహిత దారుణహత్య

సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా మృతదేహం గుర్తింపు

3లో



కుమారుడితో రాధ (ఫైల్)



సమావేశంలో అభివాదం చేస్తున్నచేనేత రాష్ట్ర నాయకులు

మరణశయ్యకు దగ్గరవుతున్న చేనేతలు

- వస్త్ర నిల్వలు ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి
- కేటాయించిన రిజర్వేషన్ అమలు చేయాలి
- జూన్ 19న కలెక్టరేట్ల వద్ద ధర్నా
- చేనేత ఐక్య కార్యాచరణ రాష్ట్ర కమిటీ తీర్మానం

ప్రజాశక్తి-చీరాల

చేనేతల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని, చేనేతలకు అందాల్సిన పథకాలు అందకపోవడం, రిజర్వేషన్ అమలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో చేనేతలు మరణ శయ్యకు దగ్గరవుతున్నారని చేనేత రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. చేనేత సమస్యలపై జూన్ 19న కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చేనేత ఐక్య కార్యాచరణ రాష్ట్ర కమిటీ తీర్మానం చేసింది. బాపట్ల జిల్లా, చీరాల అంబేద్కర్ భవన్లో చేనేత సమస్యలపై రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ 2లో

పర్యావరణ పరిరక్షణకు కృషి : కలెక్టర్

కోఆర్డినేటర్లపై తర్జనభర్జన

(మొదటిపేజీ తరువాయి)

కో ఆర్డినేటర్ల వ్యవహారంపైనా సందిగ్ధం ఉంది. బాలినేని వ్యవహారం ఓ కొలిక్కి వచ్చేదాకా ఈ మూడు జిల్లాల్లో కోఆర్డినేటర్ల జోక్యం ఉండేలా కనిపించడం లేదు. వీళ్లనూ మార్చుతారనే చర్చ పార్టీలో ఉంది. ఇక బాలినేని స్థానంలో ఎవరనే చర్చ వచ్చినప్పుడు విజయసాయిరెడ్డి పేరు ప్రచారంలోకి వచ్చింది. సోషల్‌మీడియాలోనూ, వైసిపి సామాజిక గ్రూపుల్లోనూ ఆయన పేరు ప్రధానంగా చర్చలోకి వచ్చింది. జిల్లాకు కూడా ఆయనే ఇన్‌ఛార్జిగా ఉంటారనే చర్చ నడుస్తోంది. అయితే బాలినేని వ్యాఖ్యలు చూశాక జిల్లాలో మళ్లీ టిటిడి ఛైర్మన్ వైవీ పాత్ర పెరిగినట్లు తెలుస్తోంది. జిల్లాలో తిరిగి కీలకపాత్ర పోషించే అవకాశాలున్నాయంటున్నారు. ఆయన జోక్యంతోనే విజయసాయిరెడ్డి పేరు ప్రచారానికే పరిమితమైందనే చర్చ నడుస్తోంది. ఇక్కడ ప్రత్యక్షంగా తిరిగి వైవీ పార్టీ వ్యవహారాలు చూసే అవకాశాలున్నాయా? అనేదీ చూడాలి. ఒంగోలు డిఎస్పీ పోస్టింగు విషయంలో వైవీ పాత్ర ఉందనేది పార్టీలో చర్చ సాగుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుత ప్రచారాలు, సంక్షోభాలు, పరిణామాలను పరిశీలిస్తే రానున్న కాలంలో వైవీ పాత్ర కీలకంగా ఉంటునే అంచనాలున్నాయి. ఇప్పటికే చాలా మంది ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు వైవీతోనే టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. బాలినేనికి అండగా సీనియర్ నేత కరణం బలరాం ఉన్నారు. ఇద్దరూ సీనియర్లు ఇక్కడ జరుగుతోన్న పరిణామాలపై వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. వీరిద్దరి వ్యూహం ఏమిటనేదీ ప్రధాన పార్టీల్లోనూ చర్చ సాగుతోంది. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో జరిగిన సిఎం జగన్ సభకూ బాలినేని వెళ్లలేదు. ఇది కూడా పార్టీలో చర్చకు తావిస్తోంది. ఈ పరిస్థితుల నడుమ పార్టీ కో ఆర్డినేటర్ల వ్యవహారం కూడా సందిగ్ధంగానే ఉంది.

వడదెబ్బకు ముగ్గురు మృతి

మృతుల్లో ఒకరు ఉపాధి కూలీ

ప్రకాశం జిల్లాలో గురువారం వడదెబ్బతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. దర్శిలో ఇద్దరు మృతిచెందగా.. వారిలో ఒకరు ఉపాధి హామీ కూలీ. జరుగుమల్లిలో ఓ వృద్ధురాలు వడగాలులకు మృతిచెందారు.

ప్రజాశక్తి-దరిశి, జరుగుమల్లి


రమేష్ (ఫైల్)

వడదెబ్బకు ఇద్దరు మృతిచెందిన ఘటన దరిశి, కొర్లమడుగు గ్రామాలలో గురువారం చోటు చేసుకుంది. దరిశి పట్టణానికి చెందిన చెన్నూరి రమేష్(36) మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. ఇంటి వచ్చేసరికి అస్వస్థతకు గురయ్యాడు. పరిస్థితి విష మించడంతో ఇంట్లో మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మండలం లోని కొర్లమడుగు గ్రామానికి చెందిన సిహెచ్.రామకృష్ణ(33) ఉపాధి కూలీ పనులకు వెళ్లాడు. అక్కడ వడదెబ్బ తగలడంతో ఆసుపత్రికి తీసుకెళు తుండగా మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దీంతో ఆయా కుటుంబాలలో విషాదచాయలు మిగిలాయి.


రామకృష్ణ(ఫైల్

జరుగుమల్లి మండలం, కె.బిట్రగుంట గ్రామానికి చెందిన రెడ్డి పెదకోటమ్మ(83) వడదెబ్బతో మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో మృతిచెందారు. ఈమె భర్త రెడ్డి కోటయ్య ఐదు సంవత్సరాల క్రితమే మరణించారు.


పెదకోటమ్మ(ఫైల్)

గుండెపోటుతో అంగన్‌వాడీ మృతి

ప్రజాశక్తి-మద్దిపాడు

స్థానిక బీసీ కాలనీలో అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తున్న ఆదిమూలపు పద్మావతి(45) గుండెపోటుతో గురువారం మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో అంగన్‌వాడీలు, గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ పిలుపు నిచ్చారు. భారత ప్రధాని ప్రారంభించిన మిషన్ లైఫ్(లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్)లో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఒంగోలు నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవన విధానంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఒంగోలు ప్రకాశం భవనం నుంచి మినీ స్టేడియం వరకూ గురువారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రధాని మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని ప్రారంభించారని, కార్యక్రమంలో ఏడు కార్యకలాపాలకు చెందిన 75 పర్యావరణ అనుకూల చర్యలను ప్రతి ఒక్కరూ వారి జీవన విధానంలో అలవర్చుకోవాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు. ఈ మిషన్ లైఫ్‌లో పేర్కొన్న పర్యావరణ అనుకూల చర్యలు ఏ ఒక్క సంస్థకు, పరిశ్రమకు చెందినది కాదని ప్రతి పౌరుడు పాటించాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, కార్యాలయాలు వీటిని అలవర్చుకోవాలన్నారు. ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన ఈ విషన్ వివిధ శాఖల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా అమలు చేసేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ప్రతి గ్రామ సచివాలయం, మున్సిపాలిటీలలో జూన్ 5న, ప్రపంచ పర్యావరణ దినోత్సవం వరకూ జరుగుతాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించటానికి సాధ్యమైన అన్ని మార్పులు చేస్తామన్నారు. పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యతపై కుటుంబ స్నేహితులు, ఇతరులను ప్రేరేపించటానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఇన్‌ఛార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణ, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ జి.నాగిరెడ్డి, మున్సిపల్ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, మెప్మా ప్రతినిధులు, వార్డు సచివాలయ సిబ్బంది, ట్రాఫిక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

మరణశయ్యకు దగ్గరవుతున్న చేనేతలు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం నిర్వ హించారు. సమావేశానికి మేడ వెంకట్రావు, శీలం వెంకటేశ్వర్లు అధ్యక్ష వర్గంగా వ్యవహరిం చారు. సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన చేనేత ప్రతినిధులు రాష్ట్రవ్యాప్త ఉద్యమం నిర్మించాలని ఏకగ్రీవ తీర్మానించారు.

చేనేత వస్త్ర నిల్వలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి నేతన్నలకు పని కల్పించడంలో బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ల ను పకడ్బందీగా అమలు చేయాలని, ఉల్లం ఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నేతన్న నేస్తం పథకాన్ని ప్రతి చేనేత కార్మికునికి, చేనేత వత్తిపై ఆధారపడిన ఉపవత్తుల వారికి వర్తింపజేయాలని అన్నారు. చేనేతపై జిఎస్టీని తక్షణం రద్దు చేయాలన్నారు. యారన్, పట్టు, జరీ, రంగులు, రసాయనాల ధరలను 2021 నాటి ధరలకు తగ్గించాలని కోరారు. బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.5000 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.25 వేల కోట్లు చేనేతకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్ర0భుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు, ప్రభుత్వ విద్యాసంస్థలలో బాలబాలికలకు చేనేత వస్త్రాలను సరఫరా చేయాలని కోరారు. చేనేత కార్మిక కుటుంబానికి మూడు సెంట్ల స్థలంలో మగ్గం షెడ్డుతో కూడిన ఇంటిని నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెల్లూరులోని ఆరు ఎకరాల 90 సెంట్లు ఆప్కో స్థలాన్ని తిరిగి ఆప్కోకు ఇవ్వాలని, ఆప్కో స్థలాన్ని ఇతరులకు కేటాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా ఆప్కో స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చేనేతలకు దక్కేవిధంగా చూడాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకష్ణ, చేనేత ఐక్యవేదిక సంఘం జాతీయ అధ్యక్షులు అవ్వరు మల్లికార్జున, రాష్ట్ర అధ్యక్షులు నీలూరు రుషింగప్ప, ప్రధాన కార్యదర్శి చింతా నాగేశ్వరరావు, ఎం నాగరాజు, ఏఐటీయూసీ చేనేత కార్మిక సంఘం నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, గొట్టేముక్కల బాలాజీ, మురుగుడు సత్యనారాయణ, చేనేత జన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మాచర్ల మోహనరావు, దేవనవీర నాగేశ్వరరావు, మునగాల వెంకటేశ్వర్లు, చేనేత కాంగ్రెస్ నాయకులు రామనాథం పూర్ణచంద్రరావు, మాజీ శాసనమండలి సభ్యులు బూదాటి రాధాకష్ణయ్య, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు వార్తి కోట సుబ్బారావు, పింజల భూషణ్ బాబు, ఆకురాతి లక్ష్మీకాంతం, చేనేత సొసైటీల నుండి మాచర్ల గౌరీశంకర్, కాటూరి వెంకటేశ్వర్లు, గోలి వెంకట్రావు, బీరక పరమేశ్వరరావు, చేతివత్తుల సమన్వయ కమిటీ బాపట్ల జిల్లా కన్వీనర్ పి.కొండయ్య పాల్గొన్నారు.

డిమాండ్ల సాధన కోసం జూన్ 19న ధర్నాలు

రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని తీర్మానించారు. రాష్ట్ర కమిటీ తరఫున ప్రభుత్వానికి వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. బాపట్ల, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, అన్నమయ్య జిల్లాల నుండి ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో ఉద్యమ కార్యాచరణ నిర్వహణకై వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో రాష్ట్రస్థాయి చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. న్యాయవాది వై.కోటేశ్వరరావును రాష్ట్ర కన్వీనర్‌గా, వివిధ చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులను కో కన్వీనర్లుగా ఎన్నుకున్నారు.

చిందే చెమటలు..మండే గుండెలు..

(మొదటిపేజీ తరువాయి)

లీటర్ల మంచినీళ్లకు రూ.5, గునపాల పదునుకు రూ.10 ఇచ్చేవారు. ఇప్పుడవేవీ లేవు. కూలీలు అందర్నీ ఒకేలా పరిగణించి కొలతలు ఇవ్వడంతో వద్ధులకు అవస్థలు తప్పడంలేదు. గతంలో టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌తో ప్రక్రియ మొత్తం సాగేదని, ఇప్పుడు ఎన్‌ఐసీలోకి మారడంతో కొన్ని సౌలభ్యాలు అందడం లేదన్న వాదన వినిపిస్తోంది.

బడ్జెట్‌లో తగ్గిన నిధుల కేటాయింపు..

కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 2022 నుంచి ఎస్ఐసి యాప్‌ను ప్రవేశపెట్టి ఉపాధి హామీ చట్టానికి సంబంధించిన పనులను దేశం మొత్తం ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పని దినాలలో కోత కోస్తూ బడ్జెట్లో నిధులు కేటాయింపు తగ్గించింది. గతంలో ఉదయం ఒక్కసారి మాత్రమే మస్టర్‌లో హాజరు వేస్తూ ఉండేవారు. ప్రస్తుతం ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా హాజరు వేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కూలీలు, మేట్ల మధ్య అవగాహన లోపించి సమస్యల్లో చిక్కుకుంటున్నారు. ఒక గ్రూపులోని సభ్యులందరూ పనికి వెళతామని డిమాండ్ పెట్టినా తర్వాత, గ్రూపులోని సభ్యులు వ్యక్తిగత కారణాల వల్ల పనికి వెళ్లలేకపోతే పని దినాలు తగ్గిపోవడం ఉపాధి కూలీలను ఆందోళనకు గురి చేస్తుంది.

ప్రభుత్వం టెంట్లను పంపిణీ చేయాలి

షేక్ మియా సాహెబ్, ఉపాధి కూలీ, యర్రగొండపాలెం



పని ప్రదేశంలో టెంట్లు లేని కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. పని ముగించుకొని ఇంటికి వచ్చే సరికి సొమ్మసిల్లినంత పని అవుతుంది. దీనికి తోడు గడ్డపార, తట్ట, మజ్జిగ, మంచినీటి సౌకర్యానికి సంబంధించిన ఛార్జీలను రద్దు చేసింది. ఐదు కిలోమీటర్లు దాటితే ట్రావెలింగ్ అలవెన్స్ మాత్రమే ఇస్తున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

అల్లూరి నరేష్, ఉపాధి కూలీ, యర్రగొండపాలెం



ఉపాధి పనులు చేసే ప్రాంతంలో కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలకు అలవెన్స్, మజ్జిగ, మంచినీటి సదుపాయం కల్పించాలి. గ్రామాన్ని ఒక యూనిట్‌గా చేసి వైద్య సిబ్బందిగా అందుబాటులో ఉంచాలి.

ఇబ్బంది లేకుండా చర్యలు

శైలజ, ఉపాధి ఏపీవో, యర్రగొండపాలెం



ఎండలు ఎక్కువగా ఉన్నందున రెండేళ్ల క్రితం ఇచ్చిన టార్పాలిన్లు వాడుతున్నాం. ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా మంచినీళ్లు తెప్పించి కూలీలకు అందుబాటులో ఉంచుతున్నారు. వేతనాన్ని ప్రతిరోజూ రూ. 230 అందజేస్తున్నాం. ఏప్రిల్ చివరి వారం, మే నెల రెండు వారాలు కలిపి మొత్తం మూడు వారాలకు సంబంధించి మండలానికి రూ.కోటి రావాల్సి ఉంది. కూలీలకు ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

వివాహిత దారుణ హత్య

- సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా మృతదేహం గుర్తింపు

- రుణం తీసుకున్న వాళ్లే చంపేశారా.? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండలంలోని జిల్లెలపాడు గ్రామానికి చెందిన మహిళ దారుణ హత్యకు గురైన ఘటన గురువారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోటా రాధ(35)కు తెలంగాణ రాష్ట్రంలోని కోదాడకు చెందిన మోహన్‌రెడ్డితో 2013 నవంబర్‌లో వివాహం జరిగింది. మోహన్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ.. కుటుంబంతో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. జిల్లెలపాడులోని చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల కోసం ఆమె తన తల్లిదండ్రులున్న వద్దకు వచ్చింది.



హత్యకు గురైన రాధ

రాధ తనకు తెలిసిన వెలిగండ్లకు చెందిన వ్యక్తికి వ్యాపారం నిమిత్తం రూ.70 లక్షల వరకు అప్పు ఇచ్చింది. అప్పు తీర్చాలని రాధ తరచూ అడుగుతూ ఉంది. ఈ నేపథ్యంలో బెంగుళూరులో ఉద్యోగం వచ్చిందని, దశలవారీగా తీరుస్తానని సదరు వ్యక్తి రాధకు చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రూ.2 లక్షలు ఇప్పుడు ఇస్తానని రాధ సెల్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బుధవారం సాయంత్రం కనిగిరి వెళ్తున్నట్లు రాధ తల్లిదండ్రులకు చెప్పి.. తన వెంట చిన్నకుమారుడిని తీసుకెళ్ళింది. కనిగిరిలోని వారి బంధువుల వద్ద కుమారుడిని ఉంచి పిల్లవాడికి బట్టలు తీసుకొని వస్తానని కనిగిరి టౌన్‌లోనికి వెళ్లింది. టౌన్‌లోకి వెళ్లి చాలా సమయమైనప్పటికీ ఇంటికి రాకపోవడంతో వారి తల్లిదండ్రులు వెలిగండ్ల పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చారు. పోలీసులు సెల్‌ఫోన్ ఆధారంగా విచారణ చేపట్టగా జిల్లెలపాడు అడ్డరోడ్డు వద్ద ఉన్నట్లు గుర్తించి.. సంఘటనా స్థలానికి చూడగా రాధ మృతదేహం రోడ్డు పక్కన కనిపించింది. హత్యకు గురైనట్లు నిర్ధారించుకొని.. వెలిగండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. రుణం తీసుకున్న వాళ్లే చంపేశారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని క్రైమ్ అడిషన్ ఎస్పీ శ్రీధర్, కనిగిరి డిఎస్పీ రామరాజు, పామూరు సిఐ శ్రీనివాసరావు, వెలిగండ్ల ఎస్ఐ మహేష్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు. డబ్బు కోసమని వెళ్ళిన తన కుమార్తె శవమై కనిపించడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతి

- వైద్యశాల ఎదుట మృతదేహంతో బంధువుల ధర్నా

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం ప్రాథమిక ఆర్యోగ కేంద్రం వైద్యుల నిర్లక్ష్యంగా కారణంగా ఓ నిండు గర్భిణి ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి బంధువులు మృతదేహంతో ఆర్యోగం కేంద్రం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. బాధితుల కథనం ప్రకారం... తిమ్మసముద్రం దళితకాలనీకి చెందిన తేళ్ళ సంధ్య నిండుగర్భిణి. ప్రతినెలా చీరాల ఆస్పత్రి, తిమ్మ సముద్రం ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకుంటుంది. బుధవారం ఉదయం తిమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్దకు వైద్యపరీక్షల నిమ్తితం వెళ్లింది. డాక్టకర్ సువర్ణరాజ్, డాక్టర్ ప్రసన్న సంధ్యకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ డెలివరీ అవుతుందని చెప్పి ఆస్పత్రిలోనే ఉండాలని సూచించారు. దీంతో సంధ్య ఇంటికివెళ్ళి తమ పెద్దవాళ్ళను తీసుకొని వస్తానని చెప్పింది.



వైద్యశాల ఎదుట ఆందోళ చేస్తున్న మృతురాలి బంధువులు

అయినప్పటికీ వైద్యులు ఆమెకు అక్కడే చికిత్స ప్రారంభించారు. సంధ్య ఇంటికి రాకపోవడంతో బంధువులు వైద్యశాల వద్దకు వచ్చారు. సంధ్యకు ఏమైందని వైద్యులను అడిగారు. అరగంటలో డెలివరి అవుతుందని తెలిపారు. రాత్రి 9గంటల వరకూ కాలం వెళ్లదీశారు. ఈ నేథ్యంలో సంధ్యకు కాలితీసుకోవడం కష్టమైంది. దీంతో వైద్యులు సంధ్యను చీరాల తీసుకు వెళ్ళాలని సూచించారు. బంధువులు చీరాల వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఒంగోలు రిమ్స్‌కు తీసుకు వెళ్ళాలని సూచించారు. బంధువులు ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో గురువారం సంధ్య మృతి చెందింది

మృతదేహంతో ఆర్యోగ కేంద్రం వద్ద ధర్నా

సంధ్య మృతితో ఆగ్రహించిన దళితకాలనీ వాసులు మృదేహంతో తిమ్మసముద్రం ఆర్యోగ కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. సంధ్య మృతికి కారకులైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుంటుబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. బాధితుల ఆందోళన గురించి తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకున్నారు. బాధితులకు నచ్చ చెప్పి సంధ్య మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళనను విరమించారు.

ప్రియుడు పెళ్లికి నిరాకరించాడని...

రైలు నుంచి దూకి ప్రియురాలు ఆత్మహత్య

ప్రజాశక్తి : చీరాల

ప్రియుడ పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ప్రేయసి రైలు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని జాండ్రపేట రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.... చిన్నగంజాం మండలం కడకుదురు గ్రామానికి చెందిన దేవరకొండ లక్ష్మీప్రసన్న (29) చీరాల పట్టణంలోని విటల్ నగర్ సచివాలయంలో శానిటరీ సూపర్ వైజర్‌గాఈ విధులు నిర్వహిస్తోంది. జె.పంగులూరు మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన కారుమంచి గోపి, లక్ష్మీ ప్రసన్నకు చీరాలలో కళాశాలలో చదువుకునే సమయంలోనే పరిచయం ఏర్పడింది. అనంతరం ఇద్దరు ప్రేమించుకున్నారు. గత ఏడేళ్లుగా వారి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో లక్ష్మీ ప్రసన్నకు ఆమె తల్లిదండ్రులు మరో వ్యక్తితో వివాహం జరిపించారు. అయినప్పటికీ భర్త నుంచి విడాకులు తీసుకుంటే తాను మళ్లీ పెళ్లి చేసుకుంటామని లక్ష్మీ ప్రసన్నను గోపి మాయమాటలు చెప్పాడు. దీంతో ఆమె భర్త నుంచి విడిపోయి తల్లిదండ్రుల వద్ద ఉంటూ చీరాల మున్సిపల్ పరిధిలోని విటల్ నగర్ సచివాలయంలో విధులు నిర్వహిస్తుంది. గోపి చిత్తూరు జిల్లా సత్యవేడు మండలంలో సచివాలయంలో ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మీ ప్రసన్న తనను వివాహం చేసుకోవాలని గోపిని కోరుతుంది. గోపి వివాహ విషయాన్ని దాటేస్తూ తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మీ ప్రసన్న ఇటీవల చీరాల పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేసింది. పోలీసులు గోపిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదని



లక్ష్మీ ప్రసన్న (ఫైల్)

తెలిసింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన లక్ష్మీ ప్రసన్న రైలు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు మతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలిం చారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోపిని కఠినంగా శిక్షించాలి

లక్ష్మీ ప్రసన్న మతికి కారకుడైన ప్రియుడు గోపిని, వివాహానికి అంగీకరించని గోపి బంధువులను కఠినంగా శిక్షించాలని ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు ఎన్. మోహన్ కుమార్ ధర్మ డిమాండ్ చేశారు.ప్రేమ పేరుతో భర్త నుంచి విడదీసి తాను వివాహం చేసుకుంటానని మాయమాటలతో లోబరుచుకొని చివరికి లక్ష్మీ ప్రసన్నను మోసగించిన గోపి, వారి కుటుంబ సభ్యులు కఠినంగా శిక్షించాలని కోరాడు.



బోల్తా కొట్టిన ఆటోను పరిశీలిస్తున్న ఎస్ఐ

కారు, ఆటో ఢీకొని.. 16 మందికి గాయాలు

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఆటో, కారు ఢీకొన్న ఘటనలో 16 మందికి గాయాలయ్యాయి. ఈఘటన శింగరాయకొండ– కందుకూరు మధ్యలో కనుమళ్ల గ్రామం వద్ద గురువారం చోటు చేసుకుంది. హైదరాబాదు నుంచి కాకుటూరుకు కారు వెళ్తుంది. అదే సమయంల కందుకూరు మండలం కోవూరు నుంచి 16 మంది ఆటోలో ఒంగోలు వెళ్తున్నారు. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆటో, కారు ఢీకొన్నాయి. దీంతో ఆటో బోల్తాకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న 16 మందికి గాయాలయ్యాయి . క్షతగాత్రును 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. శింగరాయకొండ ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్



విజయ్‌కుమార్(ఫైల్)

ఓ వ్యక్తి అదృశ్యంపై బాపట్ల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సిఐ కృష్ణయ్య తెలిపారు. సిఐ కథనం ప్రకారం... బాపట్ల పట్టణంలోని బెస్త పాలెంకు చెందిన నల్లబోయిన విజయ్ కుమార్ అనే వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా బుధవారం గత రాత్రి సూసైడ్ నోట్ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. విజయ్ కుమార్ నలుపు రంగు టీ షర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి వున్నాడు. విజయ్‌కుమార్ ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసు స్టేషన్ లేదా బాపట్ల పట్టణ సిఐ , 94407 96171 సెల్ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

కుమారుడి చేతితో తండ్రి హతం

ప్రజాశక్తి- దొనకొండ

కుమారుడి చేతిలో తండ్రి హతమైన ఘటన దొనకొండ మండలం పెదన్నపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని నరసింహానాయునిపాలెం గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోటు వెంకటేశ్వర్లు రోజూ మద్యం తాగుతాడు. ఇంట్లో వారిని, ఇరుగు పొరుగు వారిని దుర్భాషలాడుతుంటాడు. తల్లి, కోడళ్ళను అసభ్య పదజాలంతో దుర్భాషలాడటం వెంకటేశ్వర్లు(50)కు పరిపాటిగా మారింది. రోజులాగే వెంకటేశ్వర్లు మద్యం తాగి వచ్చి అందరినీ దుర్భాలాషడుతున్నారు. దీంతో ఆగ్రహించిన వెంకటేశ్వర్లు పెద్దకుమారుడు పోటు వెంకటనర్సు మద్యం మత్తులో కర్రతో తన దండ్రిని కొట్టాడు. దీంతో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం వినుకొండ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య రమణమ్మను వెంకటేశ్వర్లు మృతిగురించి వివరాలు కోరగా తన భర్త ఫుల్‌గా మద్యం తాగి మంచం కోడుపై పడి గాయాలై మృతి చెందినట్లు తెలిపింది.. కురిచేడు ఎస్ఐ ఎం.దేవకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

కూలీలకు కనీస వసతులు కరువే..

- తాగునీరు, మజ్జిగ పంపిణీ ఊసే లేదు
- కనిపించని టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు

ప్రజాశక్తి రేపల్లె
పని ప్రదేశాల్లో కనీస వసతులు కూడా లేక పోవడంతో ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ చట్టం పనులు చేస్తున్న కూలీలు మండుటెండలో అల్లాడిపోతున్నారు. కూలీలు కాసేపు సేద తీరడానికి టెండ్లు ఏర్పాటు చేయాలి. వేసవి తాపం నుంచి రక్షణ కోసం మజ్జిగ, మంచినీరు అందించాలి. అయితే పని ప్రదేశంలో అవేవి కనిపించడం లేదు.

అందుబాటులోని లేని మెడికల్ కిట్లు
కూలీలకు పనిప్రదేశంలో అనారోగ్య సమస్యలు తలెత్తినా, వడదెబ్బ తగిలినా తాత్కాలిక ఉపశమం కోసం అవసరైన మెడికల్‌కిట్లు పని ప్రదేశంలో అందుబాటులో ఉంచాలి. అవి ఎక్కడా కనిపించడం లేదు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున అనేక మంది అస్వస్థతకు గుర్రై సొమ్మసిల్లిపడిపోతున్నారు. అయినప్పటికీ పని ప్రాంతాల్లో ప్రథమ చికిత్స కిట్లు కూడా లేవు. ఈ విషయం గురించి ఎపిఒ కె. సుబ్బరాజు వివరణ కోరగా మంచి నీరు తీసుకెళ్లినందుకు రూ.5 చొప్పున చెల్లిస్తున్నట్లు తెలిపారు. నీడనిచ్చేందుకు టార్పాలిన్ పట్టలు, మెడికల్ కిట్లు, మజ్జిగ మంజూరు ఇంకా కాలేదన్నారు. **అద్దంకి :** ప్రనిప్రదేశంలో కనీస సౌకర్యాలు లేక ఉపాధి కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ, కొద్దిసేపు విశ్రాంతి తీసుకొచేందుకు తార్పాలిన్ పట్టలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో మొత్తం 10, 518 జాబ్ కార్డ్ ఉన్నాయి. 18,978 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరుతున్నారు. **నిజాంపట్నం** : పని ప్రదేశంలో కనీస వసతులు కూడా లేక పోవడంతో కూలీలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం తాగునీరు, టెంట్ కూడా లేక పోవడంతో కొద్ది సేపు సేదతీరేందుకు కూడా వీలు కావడం లేదు. మండలంలో సుమారు 17 వేలు జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో ఐదు వేలు మంది మాత్రమే ఉపాధి పనులకు వెళ్తున్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించి, రోజు వారీ కూలీ గిట్టుబాటు అయ్యేలా చూడాలని కూలీలు కోరుతున్నారు.


రేపల్లె ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలు


అద్దంకిలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలు


నిజాంపట్నంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలు

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలని నిరసన

ప్రజాశక్తి- భట్టిప్రోలు
దేశానికి గుర్తింపు, ఖ్యాతిని తీసుకొచ్చే రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపీ ,భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు పి.మనోజ్, జి.సుధాకర్ మాట్లాడుతూ స్టార్ రెజ్లర్ల పట్ల లైంగిక వేధింపులు పాల్పడిన ఎంపీని అరెస్టు చేయకుండా ప్రధాని నరేంద్ర మోడీ అడ్డుతగులుతున్నాడని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఢిల్లీ పోలీసులు కోర్టు అదేశించే వరకూ కేసు నమోదు చేయక పోవడం దారుణమన్నారు. తమకు న్యాయం చేయాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్న మహిళ రెజ్లర్లను బెదిరింపులకు గురిచేయడం దారుణమన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ దేశ ప్రజలందరూ ఐక్యంగా ఆందోళన చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, ఎస్ఎఫ్ఐ, సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు. **చిన్నగంజాం :** దేశానికి కీర్తి ప్రతిష్టలను తెచ్చిపేట్టే మహిళా రెజ్లర్లను వేధించిన బిజెపి ఎంపీని వెంటనే అరెస్టు చేయాలని సిఐటియు కార్యదర్శి జి.ప్రతాప్ కుమార్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ బొమ్మ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ నడిబొడ్డున మహిళా రెజ్లర్లు వేధింపుల నుంచి తమకు కాపాడాలని ఎంపీని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం మహిళల పట్ల వివక్ష చూపిస్తుంది అనటానికి ఇదే నిదర్శన మని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్ రెడ్డి, ప్రకాష్ పుల్లయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.


భట్టిప్రోలులో నిరసన తెలుపుతున్న నాయకులు


చిన్నగంజాంలో నిరసన తెలుపుతున్న నాయకులు


గడప గడపకూ మనప్రభుత్వంలో మంత్రి నాగార్జున

పేదల సంక్షేమమే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి- కొల్లూరు
పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున తెలిపారు. మండల పరిధిలోని చిన్న పులివర్రు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలు, రైతులు, డ్వాక్రా మహిళలకు అండగా ఉంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'యద్దనపూడి' సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-బాపట్ల
తెలుగు నవలకు అక్షర నీరాజనం పలికిన రచయిత్రిగా పేరుగాంచిన యద్దనపూడి సులోచనారాణి సేవలు చిరస్మరణీయులని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ తెలిపారు. యద్దనపూడి సులోచన రాణి ఐదో వర్ధంతి సందర్భంగా సాహితీ భారతీయ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సులోచనరాణి రచించిన 75 నవలు రచించినట్లు తెలిపారు. అందులో మీనా, సెక్రటరీ ,జీవన తరంగాలు, విచిత్రబంధం ,బంగారు కలలు, జై జవాన్ సినిమాలుగా తరకెక్కాయన్నారు. సాహితీ భారతి ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు మాట్లాడుతూ సులోచన రాణి మధ్య తరగతి కుటుంబాల్లోని బాంధవ్యాలు ఆత్మీయతా నురాగాలు ఆత్మస్థైర్యాలకు నవలల ద్వారా అక్షర రూపం కల్పించారన్నారు. ఆమె రచించిన కీర్తి కిరీటాలు నవలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, ఆత్మగౌరవం, కాంచన గంగ చిత్రాలకు నంది అవార్డులను అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ, ఎం.జాకబ్, ఎన్.కష్ణ ,కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు, రెంటాల మురళీ, రాధా కష్ణమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


సులోచనా రాణి చిత్ర పటం నాయకుల నివాళి


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి ఖాదర్ బాషా

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సంతమాగులూరు
మండల పరిధిలోని కొమ్మాలపాడు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచి ఖాదర్ మస్తాన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వేసవికాలం, వడగాలులు వీస్తుండడం, గ్రామ సచివాలయానికి వచ్చి పోయే ప్రజలు, సచివాలయ సిబ్బంది సౌకర్యార్థం చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.


మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న దృశ్యం

ఉచిత మజ్జిగ శిబిరం

ప్రజాశక్తి- రేపల్లె
వేసవి నేపథ్యంలో రేపల్లె పట్టణ తెలుగు మహిళ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమతధార ఉచిత మజ్జిగ ఆవర రోజుకు చేరింది. మజ్జిగ పంపిణీని మాజీ ఎమ్మెల్యే ఎం. వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. ఉచిత మజ్జిగ శిబిరం నిర్వహణ కోసం నిర్వాహకులకు రూ. 5 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా సెల్ అధ్యక్షురాలు పొన్నూరు గౌరీ రామకుమారి,కార్యదర్శి మోర్ల అరుణ కుమారి,జిల్లా మహిళా కార్యదర్శి కామరాజుగడ్డ నాగశ్రీ, నియోజకవర్గ మహిళా సెల్ కార్యదర్శి కనికచర్ల శ్రీదేవి, టిడిపి పట్టణ అధ్యక్షుడు జిపి. రామారావు, జివి.నాగేశ్వరరావు, తాడిపర్తి మల్లికార్జునరావు, యేమినేని యానాదిరావు, వెనిగళ్ళ శివ సుబ్రహ్మణ్యం, బద్దెల సాయ, మల్లిపెద్ది రంగారావు, వడ్డి లక్మోజి పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి-చెరుకుపల్లి
రైతులు తమ పొలాలలో భూసార పరీక్షలు చేయించుకొని ఫలితాలకు అనుగుణంగా ఎరువులు, పురుగుమందులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎఒ బాలాజీ గంగాధర్ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద భూసార పరీక్షలకు రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో మట్టి నమూనాలు సేకరించి రైతులకు భూసార పరిస్థితిపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా భూసాంద్రత తెలుసుకొని అవసరమైన మేరకే ఎరువులను వినియోగించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలన్నారు.

బియ్యం దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-వేటపాలెం
బియ్యం దుకాణదారులు నిబంధనలు తప్పక పాటించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీ స్వర్ణగీత హెచ్చరించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని బియ్యం దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం శాంపిల్‌ను సేకరించారు. అనంతరం స్వర్ణగీత మాట్లాడుతూ బియ్యం దుకాణాల వద్ద స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. బోర్డులపై స్టాక్ వివరాలు, ధరల పట్టికలు నమోదు చేయాలన్నారు.



మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఈ నెల 21 22 23 తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న ఎల్ఐసి ఏఓఐ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఎల్ఐసి ఒంగోలు బ్రాంచ్ వద్ద గేట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎల్ఐసి రాష్ట్ర నాయకులు కే బాలచంద్రం మాట్లాడుతూ ఎల్ఐసి ప్రజల సంస్థ అని దానిని ప్రైవేటు వ్యక్తులకు ధారాధత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అన్నారు. కొత్తగా ఉద్యోగులను నియమించకపోవడం, ఉద్యోగుబలకు, ఏజెంట్లకు ఉన్న సౌకర్యాలను తొలగించడం చేస్తుందని అన్నారు. అదేవిధంగా పాలసీదారులపై జిఎస్టి పేరుతో భారం మోపుతుందని అన్నారు. ప్రజలకు అత్యంత విశ్వసనీయ సేవలు అందిస్తున్న ఎల్ఐసి సంస్థను ప్రైవేటు పరం కాకుండా కాపాడుకోవడం కోసం ఏజెంట్లు, ఉద్యోగులు, పాలసీదారులు, ప్రజలు అందరూ కలిసి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఇందుకోసం విశాఖపట్నంలో జరిగే మహాసభలో కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. యల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు పారా శ్రీనివాసరావు, జి కోటేశ్వర రావు ఎఓఐ మహాసభలకు సంఘీబావం ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్ వెంకట్రావు, సిహెచ్ వి సుబ్బారెడ్డి, బి వెంకటరావు, సిహెచ్ నరసింహారావు, ఎన్ బసవయ్య, ఎం కొండలరావు, కె రమణారెడ్డి, పాపని సుబ్బారావు, జి శ్రీనివాసులు, చింపిరయ్య తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి: ఎల్ఐసి ఏవోఐ అఖిల భారత ఆరో మహాసభలను జయప్రధం చేయాలని కోరుతూ గురువారం కనిగిరి ఎల్ఐసి శాటిలైట్ కార్యాలయం వద్ద కరపత్రాలను ఏవోఐ నాయకులు ఆవిష్కరించారు. మేనేజర్ పిసిహెచ్ సుబ్బయ్య, డివోలు సిఎల్‌కె ప్రసాద్,పి కొండల్ రావులకు కరపత్రాలు పంపిణీ చేశారు. మహాసభలను జయప్రధం చేయాలని ఏజెంట్‌లను కోరారు. కార్యక్రమంలో యూనియన్ నెల్లూరు డివిజన్ ఉపాధ్యక్షులు సిఎం కొండయ్య,ఎం వెంకటరమణ, అనూక్, ఎస్ తిరుపతిరెడ్డి,జివి ప్రసాద్, ఎం తిరుపాలురెడ్డి, ఎం బ్రహ్మారెడ్డి, పి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4 కోట్ల విలువైన మున్సిపల్ స్థలం కబ్జా.!

అధికార పార్టీ అండతో అక్రమ రిజిస్ట్రేషన్.!

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ నడిబొడ్డున గల రూ. కోట్ల ఖరీదైన మున్సిపల్ స్థలానికి దిక్కులేకుండా పోయింది. అధికార పార్టీ అండతో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని రూ. కోట్ల విలువ చేసే ఆ స్థలాన్ని సొంతం చేసుకున్నాడు. ఇటీవలే ఆ స్థలంలో భవన నిర్మాణ పనులు ప్రారంభించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మున్సిపల్ అధికారులతో పాటు రెవెన్యూ ఉన్నతాధికారులందరికీ మున్సిపల్ స్థలం అన్యాక్రాంతమైందని తెలిసినా మిన్నకుండిపోయారు.

మార్కాపురం పట్టణంలో ఎపిఎస్ఆర్‌టిసి బస్టాండు పట్టణానికి నడిబొడ్డు అనే చెప్పాలి. ఇటీవల కాలంలో బస్టాండు ప్రదేశం అంతా వ్యాపార కేంద్రంగా మారింది. అక్కడ గజం స్థలం రూ. లక్షకు పైగా ధర పలుకుతోంది. ప్రధాన రహదారికి అయితే దాని ధర నాలుగింతలు అధికం. ఆ ఖరీదైన ప్రాంతంలో క్రిస్టియన్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన స్థలాలు ఉన్నాయి. కమ్యూనిటీ అవసరాల రిత్యా సర్వే నెంబర్ 494/బి4లో 0.10 సెంట్ల స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించారు. ఆ స్థలం ఇప్పటికీ మున్సిపల్ ఆధీనంలో ఉంది. గతంలోనూ ఓ దఫా ఇదే స్థలంలో అక్రమ కట్టడాలకు ఓ వ్యక్తి పూనుకోగా అప్పటి అధికారులు అడ్డుకున్నారు. అంతటితో ఆ సమస్య సమసి పోయింది. ప్రస్తుత కాలంలో బస్టాండు ప్రాంతం ఖరీదైనదిగా మారింది.



మున్సిపాలిటీ స్థలంలో అక్రమ నిర్మాణం

వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందింది. అధికార పార్టీకి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు ఆ స్థలాన్ని కొట్టేయాలని పథకాన్ని రచించారు. ఆ స్థలాన్ని అక్రమంగా రెండు నెలల క్రితం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగింది. మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అయితే అందరికీ తెలుస్తుందని... ఒంగోలులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ జరిగింది. రిజిస్ట్రేషన్ చేసిన అధికారికి పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టజెప్పినట్లు తెలిసింది. ఇదే సర్వే నెంబర్‌పై రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు నెంబరు కూడా ఆన్‌లైన్‌లో కనిపించకుండా చేశారు. ఇసి కూడా తీసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకోవడంతో ఆ స్థలానికి సంబంధించి ఎవరూ సమాచారం రికార్డు పరంగా తీసుకునే అవకాశం కల్పించలేదు.

బస్టాండు ఆనుకునే రహదారి అంచున ఉన్న ఈ 10 సెంట్ల స్థలం తక్కువలో తక్కువ అన్నా కూడా రూ. 4 కోట్ల విలువ ఉంటుంది. గజం రూ. లక్ష మేర ధర పలుకుతోంది. ఇంతటి విలువైన మున్సిపల్ స్థలం కళ్లెదుటే అన్యాక్రాంతమవుతున్నా మున్సిపల్ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారనేది చర్చనీయాంశంగా మారింది.

నోటీసులు ఇచ్చాం...

మున్సిపల్ కమిషనర్ గిరికుమార్



సామాజిక అవసరాల కోసం క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ వారు మున్సిపాలిటీకి అప్పగించిన స్థలంలో కట్టడాలు ప్రారంభించిన వ్యక్తికి నోటీసులు ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ బిఎస్ గిరికుమార్ చెప్పారు. ఆ స్థలానికి సంబంధించి తగిన ఆధారాలు చూపాలని కోరామన్నారు. తాత్కాలికంగా కట్టడాలు కూడా నిలిపివేసినట్లు చెప్పారు. మున్సిపల్ స్థలాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేరస్తులకు అండగా మోడీ ప్రభుత్వం

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు
- ఢిల్లీలో మహిళా రెజ్లర్లు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా సంతకాల సేకరణ..

ప్రజాశక్తి-కొండపి

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బిజేపి ఎంపి బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను, హర్యానా క్రీడా శాఖ మంత్రి సందీఫ్ సింగ్‌ను అరెస్టు చేయాలని గత 26 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసన దీక్షలకు మద్దతుగా కొండపిలోని గాంధీ విగ్రహం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, రైతు, సిఐటియు సంఘాల ఆద్వర్యంలో సంతకాల సేకరణ గురువారం నాడు జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రారంబించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ దేశా నికి స్వర్ణ పతకాలు సాధించిపెట్టిన మహిళా క్రీడాకారులు తమపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని బజారున పడాల౬ఇసన దుస్థితిని పాలకులు కల్పించారని అన్నారు. ప్రపంచ దేశాలలో భారత క్రీడా ప్రతిష్ఠను ఇనుమడింపచేస్తున్న అగ్రశ్రేణి రెజ్లింగ్ క్రీడాకారులు సాక్షి మాలిక్, వినేష్ పోఘాట్, బజరంగ్ పూనియా తదితర క్రీడాకారులు ఈ ఉద్యమాన్ని సాగిస్తున్నారని తెలిపారు. క్రీడా పోటీలకు ఎంపిక కావాలంటే తాము కోరిన వన్నీ చేయాలని, లైంగిక వేధింపులకు , దాడులకు రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బిజేపి ఎంపి బ్రిజ్ భూషణ్, మరి కొంత మంది పాల్పడుతున్నారని ప్రభుత్వ అధికారులకు , క్రీడా మంత్రికి గత జనవరి నెలలో తెలియచెప్పడం జరిగిందన్నారు. విచారణ జరిపిచర్యలు తీసుకుంటామని చెబుతూనే అధికార యంత్రాంగం అంతా దోషులకు మద్దతుగా వ్యవహరించడం , బెదిరింపులకు పాల్పడటం జరిగిందని అన్నరు. తమ మీద లైంగిక వేధింపులు జరిగాయని విధిలేని పరిస్థితుల్లోనే , సిగ్గు విడిచి మహిళా క్రీడాకరులు నిరసన ఉద్యమంలోకి రావాల్సిన పరిస్థితిని ప్రభుత్వమే కల్పించిందని తెలిపారు.



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

బ్రిజ్ భూషణ్ శరస్సింగ్ 41క్రిమినల్ కేసుల్లో ఉన్నాడని, అతనితో పెట్టుకుంటే అంతు చూస్తాడని, ఉద్యమాన్ని విరమించుకొని ఇంటికి పోండని పాలకులు మాట్లాడటం సిగ్గుచేటని ఆయన అన్నారు. అనేక అవమానాలను, ఆటంకాలను అధిగమించి, ఆడబిడ్డలు అనేక ఉద్యమాలు సాగిస్తున్నారని, దాన్ని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు అణగదొక్కే చర్యలకు పాల్పడటం, అనాగరికమైన మనువాద భావజాలాన్ని నెత్తికెత్తుకోవడం విచారకరమని ఆయన అన్నారు. దేశ క్రీడా కీర్తి పతకాలు ప్రపంచ దేశాల్లో వెలుగెత్తి చాటుతున్న మహిళా క్రీడాకారులు, స్వర్ణ పథక విజేతలు, బజారున పడిగత 26 రోజులుగా నిరసన ఉద్యమం చేస్తుంటే కళ్ళుండి చూడలేని కబోదిలా మోడీ ప్రభుత్వం ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్ న్యాయమూర్తితో విచారణ జరిపించి దోషులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంగం రాష్ట్ర కమిటి సభ్యులు కె.జి మస్తాన్ మాట్లాడుతూ బిజేపి ప్రభుత్వం అనాగరిక పాలన సాగిస్తున్నదని విమర్శించారు. ఈ రెజ్లర్ల ఆందోళన విషయంలోనే కాదని, బిజేపి పాలకులు మహిళల మీద జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు పట్ల అనాగరికంగానే వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో ఉత్తర ప్రదేశ్‌లోని వున్నావ్ గ్రామంలో తన ఇంటిలోనే పనిచేస్తున్న మహిళలపై ఎమ్మెల్యే అత్యాచారానికి పాల్పడితే ఆ ఎమ్మెల్యేకు మద్దతుగా బిజేపి నేతలు వ్యవహరించారని అన్నారు. ఇటీవల గుజరాత్‌లోని బిల్కీస్ భానుపై 11 మంది అత్యాచారం చేసినటువంటి దోషులకు జైలు నుంచి విడుదల చేసి దోషులకు దండలు వేసి స్వాగత సత్కారాలు చేసి పైశాచిక ఆనందం పొందారని ఆయన విమర్శించారు. ఢిల్లీలో రెజ్లర్లు చేస్తున్న ఉద్యమానికి క్రీడాకారులు, క్రీడాభిమానులు, యావత్తు ప్రజానీకం సంపూర్ణమైన మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రెజ్లర్లకు మద్దతుగా సంతాకాలు సేకరించి రాష్ట్రపతికి అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అంగలకుర్తి బ్రహ్మయ్య, సిఐటియు నాయకులు జి.వందనం, రైతు సంఘం నాయకులు ముప్పరాజు బ్రహ్మయ్య, మల్లెల కొండయ్య, యం.చిన్నపేతురు, సిహెచ్ సునంద, కె.బసవయ్య,ఎ.సూరిబాబు పాల్గొన్నారు.

మధుసూదనరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కొండపి



మదుసూధనరావుకు నివాళుర్పిస్తున్న దామచర్ల పూర్ణచంద్రరావు

మండలంలోని చోడవరం గ్రామానికి చెందిన కమలడైరీ వ్యవస్థాపకుడు, మాజీ వైస్‌యంపిపి, శ్రీ లక్ష్మినరసింహస్వామి ఉపాసకులు, రాష్ట్ర వాణిజ్య విభాగం నిర్వహణకార్యదర్శి అయిన రావిపాటి మధుసూధనరావు గుండెపోటులో మృతి చెందిన సంఘటన పాఠకులకు తెలిసిందే. గురువారం నాడు ఆయన నివాసంలో దినధిశ కర్మ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి తేదేపా సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణ చంద్రరావు హాజరై మధుసూధనరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ నాయకులు రావిపాటి సీతమ్మ, మండల పార్టీ అద్యక్షులు బి.యలమంద నాయుడు, నాయకులు తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, చింతల వెంకటరావు, నన్నూరి సుబ్బరామయ్య, ఎల్‌యంటి శ్రీను, దామా మురళి, బత్తుల నారాయణస్వామి, రాఘవ, తేదేపా నాయకలు పాల్గొని నివాళులర్పించారు.

ప్రజాబలంతో గెలవాలన్నదే లక్ష్యం

డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

కార్యకర్తలే బలమని, ప్రజాబలంతో గెలవాలనే లక్ష్యంతో కృషిచేస్తున్నట్లు కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలియజేశారు.స్థానిక అమరావతి గ్రౌండ్‌లో రాష్ట్రానికి ఇదేమి ఖర్మ ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విలేకరుల సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కష్టకాలంలో తోడుగా నిలిచిన వారికి అండగా ఉంటానని ,అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజాసేవచేయాలని ప్రజల్లో ఉండటం జరిగిందన్నారు.ప్రతి కార్యకర్త 10నెలలు ప్రజల్లో ఉండి కష్టపడితే విజయం వరిస్తుందన్నారు.పార్టీపిలుపుమేరకు రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో పాల్గొన్నవారికి



మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

ధన్యవాదాలు తెలిపారు.ప్రజలనుంచి సేకరించిన ఫీడ్‌బ్యాక్ ఫారాలను ఒంగోలుకు ప్రత్యేక వాహనంలో తరలించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాచమళ్ల శ్రీనివాసరెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, షేక్ ఫిరోజ్, నంబుల వెంకటేశ్వర్లు, చింతలపూడి తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న దారపనేని

భూములకు నష్టపరిహారం చెల్లించండి

కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని

ప్రజాశక్తి-పామూరు

పామూరు మండలంలోని పామూరు గ్రామంలో రైల్వేలైన్ కోసం నా భూమి 163/2 సర్వే నెంబర్ లోని య.0.28 సెంట్లు రైల్వే శాఖ అధికారులు తీసుకొని నష్టపరిహారం కింద రూ. 8 లక్షల 16 వేలు మంజూరు చేసి ఉన్నారు. ఆ నష్టపరిహార రుసుము త్వరగా అందేలా చూడాలని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు జ్వాలా నరసింహం, ఆర్ఐ ప్రవీణ్ కుమార్‌కు రైల్వేలైన్‌కు సంబంధించిన నష్టపరిహార వినతిపత్రం, తూర్పు కోడిగుడ్లపాడు గ్రామానికి సంబంధించిన వినతి పత్రం అందజేశారు. తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పరిధిలో పోతవరం, ఇరిగినేని నగర్, జంగాలపల్లె, కోడిగుడ్లపాడు, ఎస్సీ కాలనీ ఐదు గ్రామాలు ఉన్నాయని బరేల్ గౌడ్స్ కు రహదారులు లేక ప్రహరీలు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, త్వరగా స్పందించి సమస్యను పరిష్కరించాలని, ప్రజలు పడుతున్న అవస్థలను తీర్చాలని జ్వాల నరసింహం కు దారపనేని విజ్ఞప్తి చేశారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి

అటవీశాఖ డిఆర్ఒ వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి-పామూరు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, ప్లాస్టిక్‌ను నివారించడం, నీటిని పొదుపుగా వినియోగించడం తెలుసుకోవాలని అటవీశాఖ డిఆర్ఒ ఎ వెంకటసుబ్బయ్య అన్నారు. బుధవారం మండలంలో వగ్గంపల్లి, బలిజపాలెం గ్రామాలలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులకు పలు సూచనలు చేసి ఆయన మాట్లాడుతూ పర్యావరణం బాగుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్లాస్టిక్‌ను వినియోగించడం వలన భావితరాలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వ్యవసాయ కూలీలు, గ్రామస్తులు, ఎఫ్‌బిఒలు దొరసాని, రోజారమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటిడిఏ పీవో రవీంద్రారెడ్డి

మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని పనుకుమడుగు గూడెం చెంచులతో ఐటిడిఏ పీవో డాక్టర్ బి రవీంద్రారెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న చెంచు పిల్లవానికి తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని ఐటిడిఏ డిప్యూటీ డియంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం శ్రీనివాసరావును ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రులు లేని పిల్లల బాగోగులు చూసుకొనుటకు అతని సంరక్షకురాలకు రూ.15 వేల విలువ గల మేకలను అందిస్తామని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో నీటి సమస్య ఉందని గుర్తించి సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించవలసినదిగా ఆదేశాలు జారీ చేశారు. గత ఎనిమిది రోజుల నుండి యర్రగొండపాలెం, దోర్నాల మండలాల్లో కెఎల్ యూనివర్సిటీ విద్యార్థులు చెంచుల స్థితి గతులను తెలుసుకుంటున్న విద్యార్థులను అభినందించారు.

నీటి సరఫరా పనులు

త్వరలో ప్రారంభిస్తాం: కుందురు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పెద్దచెరువుకు నీటిని అందించే పనులను త్వరలో ప్రారంభిస్తున్నట్లు మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జున రెడ్డి అన్నారు. గురువారం ఉదయం నగర పంచాయతీ పరిధిలోని కాటూరివారిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ నీటి ఎద్దడి శాశ్విత పరిష్కారానికి ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. గత నెలలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ పనులకు శంఖుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేసి త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని తాత్కాలికంగా వాడుకనీటి అవసరాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని గ్రామస్తులు తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్‌ను ఆదేశించారు. అంతేకాక గ్రామ ప్రజలకు ఉపయోగపడే శ్మశాన వాటికకు రహదారి వసతి సరిగా లేనందున ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వారు ఎమ్మెల్యేకు తెలిపారు. ప్రజల సంక్షేమానికి దోహదపడే విధంగా రైతులకు భరోసా కేంద్రాలు, వైద్యం కోసం విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలో సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం ముందుందన్నారు. సొంత ఇంటి కల సాకారం చేసేందుకు జగనన్న కాలనీలు ఏర్పాటుతో దేశంలో అత్యధికంగా లక్షలాది పేదలకు ఇళ్ల నిర్మాణం చేస్తున్నట్లు



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుందురు

వివరించారు. పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరోసారి గెలిపించేందుకు ప్రజలు దీవించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్, రాష్ట్ర వైసిపి కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షురాలు ఎస్‌కె నూర్జాహన్ బేగం, వైసిపి మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, బిసి సెల్ అధ్యక్షులు పులగొర్ల శ్రీనివాసులు, ఎస్‌సి సెల్ అధ్యక్షులు మల్లాపురం చిన నరసింహాలు, సిసికెఆర్ శ్రీనివాసరెడ్డి, తల్లపురెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఎస్‌కె జిలానీ పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం మండలంలోని నిమ్మవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యమ్రం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిరుపల్లి శ్రీనివాసులు, వైసిపి రాష్ట్ర నాయకులు కసిరెడ్డి వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపిపి, జడ్‌పిటిసి కొవెలకుంట్ల నరసింహారావు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో గుదిబండలా ధరలు

మాజీ ఎమ్మెల్యే పాపారావు

ప్రజాశక్తి-దరిశి

వైసిపి ప్రభుత్వంలో కరెంట్ ఛార్జీలు, నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగి పేదలకు గుదిబండగా మారాయని దరిశి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం ద్వారా సమస్యలు తెలుసుకుని కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో ఇసుక మాఫియా, బురదమయంగా రోడ్లు, నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నాయన్నారు. గ్రామాలలో అక్రమాలు పెరిగి ప్రశాంతత కరువైందన్నారు. కార్యక్రమంలో



కరపత్రాలు అందజేస్తున్న పాపారావు

నగరపంచాయితీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, పట్టణ అధ్యక్షులు యాదగిరి వాసు, మండల పార్టీ అధ్యక్షులు చిట్టే వెంకటేశ్వర్లు, నాయకులు శోభారాణి, మారెళ్ల వెంకటేశ్వర్లు, దారం సుబ్బారావు, దినకర్, శ్రీనాథ్, శ్రీను, జాలయ్య, కొండలు పాల్గొన్నారు.

పాస్‌పుస్తకాలలో తప్పులొస్తే ఎలా.?

రెవెన్యూ అధికారుల తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి

ప్రజాశక్తి-కొమరోలు

పాస్ పుస్తకాలలో తప్పులు ఉండటంపై ఎమ్మెల్యే అన్నా రాంబాబు రెవెన్యూ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కొమరోలు మండలంలోని నల్లగుంట్ల గ్రామ సచివాలయంలో జగనన్న భూ హక్కు పథకంకి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు గురువారం అర్హులకు అందజేశారు. భూ యజమానులు పాస్ పుస్తకాలు అందిస్తున్న సమయంలో పాస్ పుస్తకాలలో తప్పులతడకలను గుర్తించి ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే రెవెన్యూ సిబ్బందిపై, తహశీల్దార్ రమాదేవిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రీ సర్వే చేసి ఏం లాభమన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ చైతన్య కష్ణ నేతత్వంలో గురువారం ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య పరిరక్షణ అధికారి సయ్యద్ మసూద్ అలీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శింగరాయకొండ పంచాయతీలోని



జాగ్రత్తలు చెబుతున్న సయ్యద్ మసూద్ అలీ

నాలుగో సచివాలయం పరిధిలో ప్రజల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. వీరి వెంట సచివాలయ కార్యదర్శి సుశీల, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

కందులను పరామర్శించిన 'దామచర్ల'

ప్రజాశక్తి-పొదిలి

కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మార్కాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డిని ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, జిల్లా టిడిపి అధ్యక్షులు దామచర్ల జనార్ధన్ గురువారం పంమర్శించారు. నారాయణరెడ్డి హైదరాబాద్ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సంగతి విదితమే. దామచర్ల వెంట టిడిపి రాష్ట్ర నాయకులు కామసాని రామిరెడ్డి ఉన్నారు.



కందులను పరామర్శిస్తున్న జనార్ధన్

ఆర్టీసీ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-పొదిలి

స్థానిక ఆర్టీసి డిపోలో కార్మికులు, ఉద్యోగులకు గురువారం మేనేజర్ జె.సుందరరావు ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీచేశారు. గత వారం రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం వేసవి తాపాన్ని తగ్గించేందుకు డ్రైవర్లు, కండెక్టర్‌లకు ఓఆర్ఓస్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎం ధనలక్ష్మి, ఎంఎఫ్ నాగరాజు, ఎస్‌టిఐ జి.ధనమ్మ, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ముల్లా ఫరీఫ్, కార్యదర్శి పి ఓబులేసు, సంయుక్త కార్యదర్శి ఏ దివాకర్, ఎస్‌కెబి వలి, ఎన్‌ఎంయు కార్యదర్శి ఎస్‌కె ఏ ఆలీ, సిసిఎస్ గెలిగేట్ ఎస్ సాల్మన్ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి వైపు పయనించాలి: ఏపీఎం

ప్రజాశక్తి-ముండ్లమూరు

ఎస్సీ, ఎస్టీ స్వయంసహాయక సంఘాలు ఉన్నతి పథకం ద్వారా మార్కెట్ సదుపాయాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆర్థికాభివద్ధి పెంపొందించుకోవడానికి ఎక్కువ అవకాశం ఉందని ముండ్లమూరు మండల వైయస్సార్ క్రాంతి పథం కార్యాలయం ఏపిఎం ఎం హనుమంతరావు తెలియజేశారు. మండల వైయస్సార్ క్రాంతి పథం సమావేశ హాలులో నందు మండల స్థాయిలోని దళిత,ఆదివాసి మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. . దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ముండ్లమూరు మండలం కమ్యూనిటీ మొబైల్ లైజర్ గోపన బోయిన వెంకట్రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలు పి తిరుపతమ్మ, సీసీలు పి గురవయ్య, మోహన్ రావు, డేవిడ్, అకౌంటెంట్ మార్తమ్మ పాల్గొన్నారు.

నేటి నుండి జాతీయస్థాయి నాటిక పోటీలు

ప్రజాశక్తి-దరిశి

దరిశినాపురి నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నుండి మూడు రోజుల పాటు నాటిక పోటీలు జరుగుతాయని దరిశినాపురి నాటక కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు కలవకొలను అనంత్, కార్యదర్శి అంబటి సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. పోటీలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. నాటికపోటీలను ప్రముఖులు ప్రారంభిస్తారన్నారు. కళాకారులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి-పెద్దారవీడు

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు, సుంకేసుల సర్పంచి గుడ్డెపోగు రమేష్ తెలిపారు. మండలంలోని సుంకేసుల గ్రామ సచివాలయంలో పర్యావరణ పరిరక్షణపై సర్పంచి రమేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కూరగాయలు తేవడానికి లేదా కిరాణా షాపులకు వెళ్లేటప్పుడు బట్టల సంచులను తీసుకోని వెళ్లాలని, ప్లాస్టిక్ బ్యాగులను వాడరాదన్నారు. పగటిపూట విద్యుత్తును వధా చేయకూడదని, ప్రతి ఇంటికి కనీసం ఒక మొక్కను పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరీక్షించవచ్చని, ఎండ తీవ్రతను దష్టిలో ఉంచుకొని గ్రామంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తానన్నారు. దేశంలో లేని విధంగా మన రాష్ట్రంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి విలేజ్లో క్లినిక్ ఏర్పాటు చేసి ప్రజలకు 70 రకాల మందులు కూడా ఇవ్వడం జరుగుతుందని గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని వాలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్.పెద్దిరాజు, సచివాలయ సిబ్బంది, శ్రీను నాయక్, హమీర్ భాష, వెంకటేశ్వర్‌రెడ్డి, పురుషోత్తం, సుభానమ్మ, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచి రమేష్

ఉద్యోగుల ఆవేదన ఆలకించాలని వినతి

ప్రజాశక్తి బాపట్ల రూరల్

ఉద్యోగుల ఆవేదన అలకించండంటూ ఎపి జెఎసి అమరావతి మూడో దశ ఉద్యమ కార్యాచరణ ప్రారంభించింది. అందులో భాగంగా రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగుల వేదనను చెబుదాం అనే నినాదంతో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కష్ణమూర్తిని కలిసి వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ సిహెచ్. సురేశ్ బాబు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షను ఇవ్వాలన్నారు. 1.7.2018, 1.1.2019, 1.7.2019, 1.7.2021 పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎ అరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. 11 వ పిఆర్‌సి కమీషన్ రికమెండ్ చేసిన పేస్కేల్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. పి అర్ సి అరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లోనున్న రెండు డిఎలు విడుదల చేయాలన్నారు. ముఖ్యమంత్రి పాదయాత్ర సందర్భంగా ప్రకటించిన విధంగానే సిపిఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలన్నారు. విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలను కోరారు. స్పందించిన చీరాల ఎమ్మెల్యే బలరామ కష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి, బాపట్ల జిల్లా చైర్మన్ ఎ.హెచ్.సురేష్ బాబు, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ చీరాల డివిజన్ ప్రధాన కార్యదర్శి పి.సురేష్ బాబు, చీరాల మండల సర్వేయర్ లోకేష్, జెఎసి నాయకుడు సిహెచ్.శేఖర్, విఆర్ఒల సంఘ నాయకులు కళ్యాణ్,కోటయ్య, డి.సాల్మన్, చీరాల మండల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



చీరాలఎమ్మెల్యే కరణం బలరాంకు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు



బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి జేఏసీ నాయకుల వినతి

ఎపి ఇఎపి సెట్ పరీక్షలకు 409 మంది హాజరు

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎపి ఇఎపి సెట్ - 2023 పరీక్షలు ఈనెల 15 నుంచి నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు గురు వారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని టిసిఎస్ ఐయాన్ సెంటర్‌లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులలో ఆడ్మిషన్ల కోసం ఎపి ఇఎపి సెట్ - 2023 పరీక్షలు జెఎన్‌టియు అనంతపురం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎపి ఇఎపి సెట్ -2023 పరీక్షలు ఎంపిసి గ్రూపు వారికి కళాశాలలోని టిసిఎస్ ఐయాన్ సెంటర్ గత15 నుంచి 19 వరకూ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బైపిసి గ్రూపు వారికి ఈనెల 22 నుంచి 23 వరకూ రోజుకు 2 షిఫ్టులలో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిం చన్నట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ ఎం.వేణు గోపాలరావు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు పరీక్షా కేంద్రాలవద్ద తమ కుల ధ్రువీకరణ పత్రాలలను అంద జేయాలన్నారు. గురువారం నాటి పరీక్షకు ఉదయం పూట 215 మందికి గానూ, 202 మంది మధ్యాహ్నం సమయంలో 215 మందికి గాను 207 హాజరైనట్లు తెలిపారు. మొత్తం 430 మంది అభ్యర్థులకు గాను 409 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలకు డాక్టర్ డి. కిషోర్ బాబు పరిశీలకుడిగా, డాక్టర్ అనిల్ కుమార్ డిప్యూటీ సూపరింటెండెంట్ గా వ్యవహరిస్తున్నారు.



పరీక్షకు హాజరైన విద్యార్థులు

శివపురంలో ప్రత్యేక పారిశుధ్యపనులు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం మల్ల వరప్పాడు గ్రామ పంచాయతీ పరిధిలోని శివపురం గ్రామంలో గురువారం ప్రత్యేక పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టారు. ఇఒ పిఆర్‌డి నర్రా జగదీష్ బాబు ఆధ్వర్యంలో దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేశారు. గ్రామంలో పారిశు ధ్యం ఇంకా ఎక్కడైనా అధ్వానంగా ఉంటే గ్రామస్తులు పంచాయతీ సిబ్బంది దష్టికి తెచ్చి గ్రామంలో పారిశుధ్య నివారణకు సహకరిం చాలని ఇఒపిఆర్‌డి జగదీష్ బాబు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ జాన్ బాషా, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువలు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి- కంభం రూరల్

స్థానిక అర్బన్‌కాలనీలో సైడు కాలువలు నిర్మించాలని కోరుతూ సచివాలయం -4 కార్యదర్శి పి. కష్ణమోహన్ రెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ తమ కాలనీలో సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేసి ఏళ్లు గడుస్తున్నా సైడు కాలువల ఊసే లేదన్నారు. వర్షం పడితే ఇళ్లలోకి నీరు చేరు తున్నట్లు తెలిపారు. దీంతో తాము అనేక ఇబ్బందులకు గరువుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి సైడు కాలువలు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు షేక్ బాబు, వెంకటేశ్వర్లు, మోతి మేడం,లక్ష్మమ్మ, మహిళలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుభాషిణి

ప్రజాశక్తి - చీరాల



రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు తన వంతు కషి చేస్తానని ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుభాషిణి పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా డాక్టర్ సుభాషిణి గురువారం విలేకర్లతో మాట్లాడారు. గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శేషు కుమార్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాపట్ల ఇన్‌ఛార్జిగా విధులు చేపట్టినట్లు తెలిపారు. ఆయన స్థానంలో తనకు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. తాను నెల్లూరు నుంచి నాలుగు సంవత్సరాల క్రితం చీరాల ఏరియా ఆసుపత్రికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. తనకు ఆసుపత్రి గురించి పూర్తిస్థాయిలో అవగాహన ఉందన్నారు. హాస్పిటల్‌లో గతంలో కంటే ప్రస్తుతం వైద్య సేవలు మెరుగు పడ్డాయన్నారు .వైద్యశాలలోని సమస్య లను పరిష్కరించాలని రోగులకు 24 గంటలు ఉచిత వైద్యం అందించేందుకు తన వంతు కషి చేస్తానని చెప్పారు. సర్జరీలు, వైద్య సేవలు కోసం, సదరం ఇతర సర్టిఫికెట్ల కోసం కొంతమంది డబ్బులు వసూల చేస్తున్నట్లు ఆరోపణలు తన దష్టికి వచ్చాయన్నారు. వీటిని పూర్తిస్థాయిలో నియంత్రించి ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతామన్నారు. ఆస్పత్రిలో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు దాతల సాయం అవసరం ఉందన్నారు. దాతలు ముందుకొచ్చి ఆసుపత్రి అభివద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. రోగులకు వైద్య సేవలో ఎలాంటి అసౌకర్యం కలిగిని తనకు లిఖితపూర్వకంగా తెలియజేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డాక్టర్ సుభాషిణి తెలిపారు.



అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి- మద్దిపాడు

అంగన్‌వాడీలు విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర శిశు సంక్షేమ మంత్రి ఉషశ్రీ చరణ్ హెచ్చరించారు. స్థానిక బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులకు పౌష్టిక ఆహారం సక్రంగా అందుతుందా లేదా అని ఆరా తీశారు. నితీరు పట్ల ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డిడి వసంత బాల, పీడీ ధనలక్ష్మి, సిడిపిఒ ఇవాంజలిన్, అంగన్‌వాడీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

20న మండల సమావేశం

పర్చూరు : స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిపి మేకా ఆనందకుమారి అధ్యక్షతన ఈనెల 20న పర్చూరు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ లక్ష్మీదేవి తెలిపారు. సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, ఎంపిటిసిలు, అని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

21న ఉచిత కంటి వైద్యశిబిరం

పర్చూరు : చిన్మయ మిషన్, జిల్లా అంధత్వ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఈనెల 21న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాబోలు ఉదయ భాస్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరం స్థానిక బి.ఎ.ఆర్‌టిఎ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించన్నుట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విశ్రాంతమ్మకు నివాళి

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

మండల పరిధిలోని మంగమూరు క్రిస్టియన్‌పాలెంకు చెందిన విశ్రాంతమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె మతదేహాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బిఎన్. విజయ్ కుమార్ గురువారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, గ్రామ అధ్యక్షులు అబ్బూరి శ్రీనివాసరావు, గ్రామ నాయకులు నల్లూరి కష్ణారావు, కొండసింగు రాజు, విక్రం బాలకష్ణ, కందుల రామారావు, పరుసు బుజ్జి, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు కంకణాల గోపి ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-టంగుటూరు

గత కొన్ని రోజులుగా మండలంలో తీవ్రమైన ఎండ వేడిమి, వడగాలుల ప్రభావం అధికంగా ఉండటం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల త్రిసభ్య కమిటీ హెచ్చరించింది. వాతావరణ పరిశోధన, కేంద్ర విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా కలెక్టర్ జారీ చేసిన సూచనలను ప్రజలు తప్పకుండా పాటించాలన్నారు. ఎండ తీవ్రతకు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సాధ్యమైనంత వరకు ప్రజలు బయట తిరగకుండా ఉండటమే మంచిదన్నారు. ఎవరైనా ఎండ వేడిమి తట్టుకోలేక మరణిస్తే ప్రభుత్వ సూచనలతో పరిహారం పొందగలరని మండల త్రిసభ్య కమిటీ సభ్యులు తహశీల్దారు కొల్లిబోయిన సంజీవరావు, ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ ఎస్.ప్రసాద్ బాబు, ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా సూచించారు.

హాకీ కోచింగ్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి- సంతనూతలపాడు రూరల్

హాకీ సమ్మర్ కోచింగ్ క్యాంపును క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని డిఎస్‌డిఒ రాజరాజేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హాకీ సమ్మర్ క్యాంపును గురువారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అధ్యక్ష కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, బొడ్డు సుబ్బారావు, డైట్ కళాశాల ప్రిన్సిపల్ కిరణ్, మైనంపాడు హాకీ క్లబ్, అధ్యక్ష కార్యదర్శులు గొడుగు కాలేషా మారుతి, గ్రామ అభివద్ధి కమిటీ చైర్మన్ గొడుగు మస్తాన్, ఒంగోలు హాకీ క్లబ్ అధ్యక్షుడు రవి, కోచ్‌లు మాధవరావు, వెంకట్రావు, వేణు చిన్నారావు, పీడీ వనజ, పిఇటి రవికుమార్ పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు


ప్రజాశక్తి-పర్చూరు

మండల పరిధిలోని నూతలపాడు గ్రామంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి 8 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎన్‌సి.ప్రసాద్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.10,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు లెక్కచేయని

విద్యాసంస్థలపై స్పందించాలి

ఒంగోలు ఎంఇఒకు ఎస్‌ఎఫ్‌ఐ వినతి


ఎంఇఒకు అర్జీ ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ నిబంధనలను లెక్క చేయని ప్రైవేట్ విద్యా సంస్థలపై విద్యా శాఖ అధికారులు స్పందించాలని ఒంగోలు మండల విద్యా శాఖాధికారి కిషోర్‌కు ఎస్‌ఎఫ్‌ఐ నేతలు కోరారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్నారు. టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్ వంటి పేర్లను ఉపయోగించకూడదని చట్టం చెబుతున్నా లెక్కచేయడం లేదన్నారు. ఒక స్కూల్ కి అనుమతి తీసుకొని అనేక చోట్ల క్లాసులు నిర్వహిస్తున్నారని, చిన్నచిన్న రేకుల షెడ్లలో తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఫీజు నియంత్రణ చట్టం ప్రకారం ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలని, ఎవరూ ఈ విషయాన్ని పాటించడం లేదన్నారు. పది పరీక్షలకు హాల్ టికెట్ ఇవ్వలేక చేతులెత్తేసిన ఘటనలు, రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసిన ఘటనలు కళ్ళముందే కనబడి ఆందోళన కలిగిస్తున్న పట్టీ పట్టినట్లు ఉండటం సరికాదన్నారు. గుర్తింపు లేని విద్యాసంస్థల జాబితా ప్రకటించాలని నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.


వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఎస్‌ఒపిని సమగ్రంగా తయారుచేయాలి

అధికారులకు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సాధారణ ఎన్నికలకు సంబంధించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రోసీజర్ (ఎస్‌ఒపి) లను సమగ్రంగా తయారు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ ఎన్నికల అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులకు వచ్చిన అర్జీలను ఈ నెల 24వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 31న సప్లిమెంటరీ జాబితాను ప్రచురించాలని తెలిపారు. ఈ.ఆర్.ఓ. నెట్ 2.0 కు సంబంధించి పబ్లిక్ ఎన్‌రోల్‌మెంట్ ఓటర్లకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు. అనంతరం ఈ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. మెంటరీ ఓటరు జాబితా పబ్లికేషన్ తోపాటు సమగ్రంగా ఎస్‌ఒపి రూపొందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన ఆదేశించారు. హ్యాండ్ బుక్‌లో ఉండే సమాచారానికి అదనపు వివరాలు ఉండేలా ఎస్‌ఒపిని రూపొందించాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ కె. శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్‌ఒ ఆర్. శ్రీలత, ఒంగోలు ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్‌డిఒ అజయ్ కుమార్, ఇతర నియోజకవర్గాల ఆర్‌ఒలు పాల్గొన్నారు..

దళిత నియోజకవర్గంలో దళితులకు అన్యాయం

- రాజయ్య మృతదేహం సందర్శన- మట్టి ఖర్చులకు రూ. 50 వేలు అందజేత

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దళిత నియోజకవర్గంలో దళిత మంత్రి అధికారంలో ఉండి ఒక దళిత వ్యక్తి మరణానికి కారణం అవడం శోచనీయమని టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ ఆరోపించారు. గత నెల 21వ తేదిన చంద్రబాబు యర్రగొండపాలెం పర్యటన సంధర్భంగా జరిగిన రాళ్లదాడిలో గాయాలపాలై మరణించిన చేదూరి రాజయ్య మృతదేహాన్ని పెద్దదోర్నాల మండలం చిన్నగుడిపాడు గ్రామంలో ఆయన సందర్శించి నివాళులర్పించారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ మంత్రి చేతిలో లా అండ్ ఆర్డర్ ఉన్నప్పటికీ దళితుడి చావుకు కారణమయ్యారని ఆరోపించారు. చనిపోయిన రాజయ్య కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. చనిపోయిన రాజయ్య కుటుంబానికి టిడిపి జాతీయ అధినేత నారా చంద్రబాబు నాయుడు రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని తెలిపారు. త్వరలోనే నగదు అందజేస్తామని చెప్పారు. అనంతరం కందుకూరు టిడిపి ఇంచార్జి ఇంటూరి నాగేశ్వరరావు రాజయ్య మట్టి ఖర్చుల నిమిత్తం అతని కుటుంబ సభ్యులకు రూ. 50 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, కందుకూరు టిడిపి ఇంచార్జి ఇంటూరి నాగేశ్వర రావు, కనిగిరి ఇంచార్జి ఉగ్ర నరసింహారెడ్డి, యర్రగొండపాలెం ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, నాయకులు కాశయ్య, దొడ్డా శేషాద్రి, అంబటి వీరారెడ్డి, షేక్ మాబు, పెద్దారవీడు మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉపయోగం లేని సమావేశాలు ఎందుకు?

- ఎస్సీలపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వం విఫలం
- అమరావతిలో సెంటు స్థలంలో ఇల్లు సాధ్యమేనా.?
- జూన్ 19 నుంచి ఒంగోలులో శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి, ఎస్‌టిల సమస్యల పరిష్కార వేదిక అయిన విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో వారి సమస్యలు పరిష్కరించకుండా సమావేశాలు పెట్టడం ఎందుకని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి విమర్శించారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దళితులు, గిరిజనులపై దాడులు అరికట్టేందుకు ఎటాక్స్ కమిటీ సమావేశం ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రతి ఆరు నెలలకు జరగాల్సి ఉన్నా నేటికి జరగలేదన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు మొక్కుబడిగా నిర్వహించటం సరికాదని, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయమై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. కొండపి మండలం పెరిదేపి గ్రామంలో సొలసా రాంబ్రహ్మయ్య హత్య జరిగినా సమగ్ర విచారణ జరగలేదని, కుటుంబానికి పరిహారం అందలేదన్నారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామన్నారు. అమరావతిలో పేదలకు సెంటు స్థలం ఇస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రకటించటం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వాలు 3-5 సెంట్ల భూమి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సెంటు భూమి బాత్రూమ్ కట్టుకోవటానికే సరిపోదని, ఇల్లు సాధ్యమని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 3.5 నుంచి ఐదు సెంట్ల భూమిని నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మనువాద పాలన సాగుతుందని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 1998 డిఎస్‌సిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు. పెత్తందారీ అభ్యర్థులు ఉద్యోగాలు పొందారని విమర్శించారు. 5790 మందికి ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా 4072 మంది అభ్యర్థుల ధృవీకరణ పత్రాలు పరిశీలించారని, ఇందులో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు మొండి చెయ్యి చూపించారన్నారు.

ఒంగోలులో రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు కెవిపిఎస్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు జూన్ 19, 20, 21 తేదీలలో ఒంగోలులో జరుగుతాయని అండ్ర మాల్యాద్రి తెలియజేశారు. కార్యక్రమాన్ని చైతన్యవంతులైన మేధావులు, కెవిపిఎస్ కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ మాట్లాడుతూ జిల్లాలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులు అరికట్టేందుకు అధికారులు కృషి చేయాలన్నారు సిఎస్‌పురం నేకునాంబాద్, కొండపి మండలం పెరిదేపిలో సొలసా రాంబ్రహ్మయ్య హత్య మిస్టరీగా మారిందని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టంలో కుటుంబానికి రావాల్సిన పరిహారం అందలేదన్నారు. ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు, జిల్లా ఉపాధ్యక్షులు వి.మోజెస్ పాల్గొన్నారు.

కవాసకీ బాధితులకు ఆర్థిక సాయం అందజేత


చెక్కు అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మల్టీసిస్టం ఇన్ఫమేటరీ సింగ్రోమ్ (కవాసకీ వ్యాధి)తో బాధ పడుతున్న బాలునికి వైద్యఖర్చుల కోసం వారి తల్లిదండ్రులకు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ గురువారం లక్ష రూపాయల చెక్కును అందించారు. బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కలెక్టర్ ఈ ఆర్థిక సహాయం అందించారు. ఐదో విడత మత్స్యకార భరోసా పథకం అమలు కోసం ఈ నెల 16న బాపట్ల జిల్లా నిజాంపట్నానికి ముఖ్యమంత్రి వచ్చినప్పుడు ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం టంగుటూరు గ్రామానికి చెందిన దంపతులు కె.హదయరంజన్, సిహెచ్.ఉషారాణి కలిసి తమ కుమారుని అనారోగ్య పరిస్థితిని వివరించారు. వారి బిడ్డ పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి చలించిపోయారు. ప్రభుత్వం తరపున వైద్య సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. దీంతోపాటు తక్షణ ఆర్థిక సహాయంగా లక్ష రూపాయలను అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఉషారాణి, హదయరంజన్ దంపతులను ప్రకాశం భవనానికి పిలిపించి లక్ష రూపాయల చెక్కును కలెక్టర్ అందించారు.

బిజెపి ఎంపీ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ - ఒంగోలులో నిరసన కార్యక్రమం



నిరసనలో పాల్గొన్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అంతర్జాతీయంగా దేశానికి పతకాలుతెచ్చే మహిళా క్రీడాకారిణుల పై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ ను వెంటనే అరెస్ట్ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఒంగోలులోని సత్యనారాయణపురంలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐద్వా నగర నాయకురాలు జి.కళ్యాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ అంతర్జాతీయంగా దేశానికి స్వర్ణ పతకాలు తెచ్చే మహిళా రెజ్లర్లు గత 26 రోజులుగా దేశ రాజధాని ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద దీక్షలు చేస్తున్నారన్నారు. రెజ్లర్లు తమపై లైంగిక దాడులు జరిగాయని, తమకు న్యాయం చేయాలని చేస్తున్న దీక్షలకు ప్రజలందరూ సంఘీభావం తెలపాలన్నారు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ను, హర్యానా క్రీడా శాఖ మంత్రి సందీప్ సింగ్ ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. 26 రోజులుగా మహిళ క్రీడాకారులు వీధులలోకి వచ్చి పోరాడుతూ ఉంటే ప్రధానమంత్రి మోడీ ఏమీ మాట్లాడకపోవడం, నిందితులకు మద్దతు ఇవ్వడమేనన్నారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి లేదా హైకోర్టు రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, మైనారిటీలు, దళితులపై అకత్యాలు పెరిగాయన్నారు. అకత్యాలకు పాల్పడిన వారికి మోడీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె తెలిపారు. మహిళ మల్లయోధుల ఉద్యమానికి క్రీడాకారులు, క్రీడాభిమానులు, యావత్తు ప్రజానీకం మద్దతు తెలపాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు వై.అంజనీదేవి, ఎస్. ఇంద్రజ్యోతి, ఆర్.అన్నపూర్ణ, పి .పద్మ, కె.ఉద్యమ, బి.ఉషారాణి, ఎన్. కుసుమ, కె.శ్రీలత, సిహెచ్ రాధారాణి, కె.ఈశ్వరమ్మ ,జి.పద్మజ, ఎన్. హిమజ పాల్గొన్నారు.